క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ప్రశాంత్ హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బృందావన్ హిల్స్, ప్రశాంత్ హిల్స్, మధురనగర్, సైదప్పబస్తీ, రాజధాని స్కూల్ పరిసర ప్రాంతాలు, బండారి లేఅవుట్ రోడ్డు నెంబరు 10, శ్రీనివాస్‌నగర్ కాలనీ, వజ్రనిర్మాణ్ ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

◆ ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త లైన్ల ఏర్పాటు కారణంగా 11కేవీ రాజీవ్‌గృహకల్ప ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు న్యూ విజేత సూపర్‌మార్కెట్ ప్రాంతం, ప్రగతి జూనియర్ కళాశాల ఏరియా, రాజీవ్‌గృహకల్ప రోడ్డు, 11కేవీ మధురానగర్ ఫీడర్ పరిధిలో ఇన్‌కాయిస్ రోడ్డు, మోర్ సూపర్‌మార్కెట్ ఏరియా, అంబ భవానీ హోటల్ ఏరియా, ప్రగ్నా స్కూల్ ఏరియాల్లో,డాక్టర్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11గంటల వరకు శిల్పా లేఅవుట్, రిలయెన్స్ మార్ట్, డాలర్ హోమ్, నాస్ ఫంక్షన్‌హాలు, కెనరా బ్యాంక్ వెనుక వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గీతా జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

చింతల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గీతా జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని మంగళవారం శ్రీ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయం నుంచి చింతల్, చంద్రానగర్, రంగానగర్, సాయి నగర్ , గణేష్ నగర్ ఐడీపీఎల్ తదితర ప్రాంతాలలో భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు భగవద్గీత విశిష్టతను తెలియజేస్తూ ముందుకు సాగారు. భగవద్గీత సర్వమానవాళికి సంబంధించినదని ప్రచారం చేశారు. భగవద్గీతలో ప్రతి రోజు కనీసం ఒక్క శ్లోకం పిల్లలతో చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో సత్తాచాటిన అఖిల్

జగద్గిరిగుట్ట: ప్రగతి చెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లి, గోకరాజు ఇన్‌స్టిట్యూట్ సౌజన్యంతో సోమవారం స్టేట్ ఓపెన్ మినీ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ టోర్నమెంట్‌లో అండర్–7 విభాగంలో జగద్గిరిగుట్ట, పాపిరెడ్డినగర్‌కు చెందిన అఖిల్ మూడో స్థానంలో నిలిచింది. ఓ ప్రైవేట్ స్కూల్‌లో యూకేజీ చదువుతున్న అఖిల్‌కు ట్రోఫీ సాధించడం తల్లిదండ్రులు లక్ష్మయ్య, సువర్న సంతోషం వ్యక్తం చేశారు. డీసీపీ కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

తవ్వి వదిలేస్తే ఎలా?

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చింతల్: కొన్నేళ్లుగా ఊరిస్తున్న రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఎన్నికలకు ముందు హడావిడిగా ప్రారంభించిన అధికారులు తవ్వకాలు చేపట్టి గాలికి వదిలేశారని భగత్‌సింగ్‌నగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికాలంగా ఎదురుచూస్తున్న భగత్‌సింగ్‌నగర్‌లో 4నెలల క్రితం కొన్ని రోడ్లు పూర్తయ్యాయి. కాగా 20 రోజుల క్రితం మరో గల్లి నుంచి రోడ్లు వేసేందుకు ఇటీవలే ఎమ్మెల్యే వివేకానంద చేతుల మీదుగా రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సైతం తవ్వకాలు ప్రారంభించడంతో స్థానికులు రోడ్డు వేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

మూడు వారాలు గడిచినా సాగని పనులు..


భగత్‌సింగ్‌నగర్‌లోని రోడ్ నం.12లో సుమారు 20 రోజుల క్రితం రోడ్లు వేసేందుకు ఓ కాంట్రాక్టర్ జేసీబీతో వచ్చి గల్లీలో ఉన్న రోడ్డు తవ్వేశాడు. ఈ క్రమంలోనే కొంతమంది స్థానికులు ఎంత నిధులతో రోడ్డు వేస్తున్నామని సదరు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా తమకు తెలియదని సమాధానం చెప్పడంతో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారో తెలియని స్థితిలో మీరు ఎలా వచ్చి పనులు మొదలెడతారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జేసీబీ తవ్వకాలు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ కేవలం రోడ్డు నం.12లో మాత్రమే తవ్వి పత్తాలేకుండా పోయాడు.


భగత్ సింగ్ నగర్ రోడ్ నం.12లో నూతన రోడ్డు వేసేందుకు రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం


రోడ్డు వేసే క్రమంలో ఇళ్ల ముందు ఉన్న మెట్లను ధ్వంసం చేసిన దృశ్యం

ఇళ్లలోకి వస్తున్న పాములు..

రోడ్ నం.12లో నూతనంగా సీసీ రోడ్డు వేసేందుకు 20 రోజుల క్రితం గల్లీ రోడ్డును పూర్తిగా ధ్వంసం చేసిన కాంట్రాక్టర్ ఇళ్ల ముందు ఉన్న ర్యాంపులు, మెట్లను సైతం తొలగించాడు. దీంతో పక్కనే ఉన్న నాలా ఖాళీ ప్రదేశాల గుండా రోడ్లపైకి విద్యుత్ లైట్ల వెలుగులకు పాములు రోడ్డు మధ్యలోకి వచ్చి తిరుగుతున్నాయని భగత్‌సింగ్‌నగర్ వాసులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఇళ్ల ముందు ఉన్న మెట్లు ర్యాంపులను ధ్వంసం చేయడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇళ్లలోకి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. కాస్తో కూస్తో బాగున్న రోడ్డును ధ్వంసం చేయడంతో వృద్ధులు నడవాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితులు నెలకొందని పేర్కొంటున్నారు.


భగత్ సింగ్‌నగర్‌లో నెంబర్.12లో రోడ్డు మధ్యలోకి వచ్చిన పాము

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలి


సూరారం పోలీస్‌స్టేషన్ పరిధి హమీద్ బస్తీలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అడిషనల్ డీసీపీ సిద్ధి

సుభాష్‌నగర్: ప్రశాంత వాతావరణంలో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ డీసీపీ సిద్ధి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సూరారం కాలనీలో కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సూరారం సీఐ వెంకటేశ్వరరావు, దుండిగల్ సీఐ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు

రిటర్నింగ్ అధికారి పులి సైదులు

కుత్బుల్లాపూర్: నవంబరు మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల్ రిటర్నింగ్ అధికారి పులి సైదులు పేర్కొన్నారు. ఏర్పాట్ల సమీక్షలో భాగంగా ఆయన మంగళవారం ట్రాఫిక్, లాండ్ ఆర్డర్ పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి పర్యవేక్షించారు. నామినేషన్లు జరిగే రోజులలో 144 సెక్షన్ అమలు, వాహనాలు ఎక్కడ వరకు అనుమతించాలి... ఎంతమందిని లోపలికి పంపించాలి తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి క్షుణ్ణంగా చర్చించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటుగా నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క అభ్యర్థి ఎలక్షన్ కమిషన్ అమలు చేస్తున్న నియమ నిబంధనలకు లోబడి నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, జీడిమెట్ల సీఐ పవన్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి పులి సైదులు, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, పోలీసులు

ఇందిరాగాంధీకి నివాళి

కుత్బుల్లాపూర్: దివంగత ప్రధాని ఇందిరగాంధీ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం దూలపల్లిలో మాజీ ప్రధాని ఇందిరగాంధీ 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇందిరాగాంధీ హయాంలో దేశంలో జరిగిన అభివృద్ధి తదితర అంశాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జెమ్మి దేవేందర్, కౌన్సిలర్ శివకుమార్‌గౌడ్, నాయకులు సుదర్శన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నరేందర్, షేక్ ఇబ్రహీం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జోర్ లగాకే హైసా...

షాపూర్‌నగర్– చింతల్ ప్రధాన రహదారిలోని హెచ్ఎంటీ వద్ద మంగళవారం మధ్యాహ్నం ఓ భారీ వాహనం ఆగిపోయింది. దీంతో జీడిమెట్ల నుంచి షాపూర్‌నగర్ వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలుసుకున్న జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో లారీని పక్కకు తప్పించే ప్రయత్నం చేశారు. ఎంతకీ జరగపోవడంతో అక్కడే కొంతమంది మీడియా ప్రతినిధులు సైతం చేతులు కలపడంతో ఎట్టకేలకు వాహనాన్ని రోడ్డు మధ్యలో నుంచి పక్కకు తప్పించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. – సుభాష్‌నగర్

బిల్లుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. నీటి సరఫరాలో లేదు

నిజాంపేట్: అధికారుల నీటి బిల్లుల వసూళ్లపై పెడుతున్న శ్రద్ధ... నీటి సరఫరాపై లేదని సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య అన్నారు. ప్రగతినగర్‌లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్, జలమండలి మేనేజర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.... నిజాంపేట్ కార్పొరేషన్‌గా అవతరించినా నీటి సరఫరా పెంచకపోవడంతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రగతినగర్ పరిధిలోని 9డివిజన్‌లు, నిజాంపేట్ పరిధిలోని మూడు డివిజన్లు, బాచుపల్లి పరిధిలోని మూడు డివిజన్ల ప్రజలు తాగునీరు అందక అల్లాడుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించి తక్షణమే నీటి సరఫరాను పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్, బాలపీరు, మల్లికార్జున్, కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో ఓపెన్ హౌస్

గచ్చిబౌలి: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొండాపూర్ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశారు. బుధవారం బెటాలియన్‌లో ఆయుధాలను ప్రదర్శనకు ఉంచారు. సంస్కృతి, శ్రీనిధి, కొలంబో స్కూల్ విద్యార్థులు ఓపెన్ హౌస్‌ను సందర్శించారు. ప్రజా రక్షణలో విధులు నిర్వహించే పోలీసుల వద్ద ఉండే వివిద రకాల వెపన్స్ ఎలా పని చేస్తాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు నర్సింహాస్వామి, దేవిదాస్ విక్రమ్ రాథోడ్, రెహమాన్, సత్యనారాయణ, నారాయణదాసు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య

జీడిమెట్ల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ విజయనగరం జిల్లాకు చెందిన సింహాచలం నాయుడు బతుకుదెరువు కోసం నగరానికి వలసవచ్చాడు. చింతల్ విజయనగర్‌కాలనీలో కుటుంబంతో ఉంటున్నాడు. కాగా కుమార్తె గుడుపూరు భాగ్యలక్ష్మి(28)కు రమేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భాగ్యలక్ష్మి గతకొన్ని నెలల క్రితం భర్తతో విభేదాల కారణంగా విజయనగర్ కాలనీలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. మూడు నెలలుగా భాగ్యలక్ష్మి అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. మంగళవారం భాగ్యలక్ష్మి తల్లిదండ్రులు డ్యూటీకి వెళ్లగా పిల్లలు పాఠశాలకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న భాగ్యలక్ష్మి బెడ్‌రూంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మధ్యాహ్నం 2గంటలకు డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన తండ్రి తలుపు తట్టగా ఎంతకూ తీయలేదు. దీంతో అనుమానం వచ్చి చుట్టు పక్కలవారి సహాయంతో తలుపులు తెరచి చూడగా భాగ్యలక్ష్మి వేలాడుతూ కనిపించింది. మృతురాలి తండ్రి సింహాచలం నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రాంతంలో..

కుత్బుల్లాపూర్‌కు చెందిన వీరయ్య, లక్ష్మి(42) భార్యభర్తలు. వీరికి కుమారుడు (23) ఉన్నాడు. అతడు ఆంధ్రప్రదేశ్‌లో చదువుకుంటున్నాడు. లక్ష్మి కుత్బుల్లాపూర్ ప్రధాన రోడ్డులో కర్రిపాయింట్ నిర్వహిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో లక్ష్మి ఒక్కతే ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం 2గంటలకు వీరయ్య ఇంటికి వెళ్లగా లోపలి నుంచి తలుపు గడియలు పెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా లక్ష్మి తలుపులు తీయకపోవడంతో తలుపులు పగలగొట్టి చూడగా లక్ష్మి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. భర్త వీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బాలానగర్: బాలనగర్‌లోని హెచ్ఏఎల్ కంపెనీ గేటు ముందు ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. శ్రీనివాసాచారి (60) బాలానగర్‌లో లాడ్జిలో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు హెచ్ఏఎల్ గేటు ముందు నుంచి వాహనం మీద వస్తుండగా వినయ్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొట్టగా శ్రీనివాసాచారి తలకు తీవ్ర గాయమైంది. పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివేకానంద్‌ను ఆశీర్వదించి గెలిపించాలి

• ఎమ్మెల్సీ, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ శంభీపూర్ రాజు • ప్రజా ఆశీర్వాద సభకు భారీగా హాజరైన ప్రజలు, కార్యకర్తలు


షాపూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


రాజీవ్ గాంధీనగర్‌లో జరిగిన ప్రచారంలో ఎమ్మెల్యే వివేకానంద్‌కు బ్రహ్మరథం పడుతున్న జనం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ.6వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే వివేకానంద్‌ను మరోసారి ఆశీర్వదించి హ్యాట్రిక్ విజయం తెచ్చి పెట్టాలని ప్రభుత్వ విప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం గాజులరామారం విన్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో, షాపూర్‌నగర్‌లోని ఎంజే గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌ల సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి గతంలో ఎన్నడూ లేని విధంగా చేసుకున్నామన్నారు. 75 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపటని అభివృద్ధిని పదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ చేసి చూపెట్టారన్నారు.ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.


◆ కుత్బుల్లాపూర్‌లో హ్యాట్రిక్ విజయం సాధించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, డివిజన్ల అధ్యక్షులు విజయరామ్ రెడ్డి, పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, రషీద్ బేగ్, కమలాకర్, పర్సా శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, సిద్దిక్, యూత్ అధ్యక్షులు దొడ్ల శ్రీను, డాక్టర్ హుస్సేన్, ఫిరోజ్, మధు, బషీరుద్దీన్, చెక్క సురేష్ బాబు, సుధాకర్ రెడ్డి, విట్టల్, గండయ్య తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలి


◆ సుభాష్‌నగర్ డివిజన్ జగన్నాథ స్వామి దేవాలయంలో జగన్నాథ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ వార్షికోత్సవ వేడుకలకు, మహాలక్ష్మి పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. డివిజన్ల అధ్యక్షులు పోలే శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్, ఎం.ఎస్.వాసు, బలరామ్‌రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పలువురు

◆ గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో సీనియర్ నాయకులు జహంగీర్, మామిల ఆధ్వర్యంలో శ్రీను మిత్రబృందం, సీనియర్ నాయకుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో హెచ్ఏఎల్ కాలనీకి చెందిన ఆనంద్‌సాయి మిత్ర బృందం సభ్యులు, ఉమాదేవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ రాములుగౌడ్, బీఎంఎస్ ట్రేడ్ యూనియన్ నాయకుడు చందర్‌యాదవ్ తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గాజులరామారం డివిజన్‌లోని అనేక బస్తీలు, కాలనీలల్లో కోట్లాది రూపాయలతో మంచినీరు, రోడ్ల నిర్మాణం , భూగర్భ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను చేపట్టామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.


ఎమ్మెల్యేకు హ్యాట్రిక్ విజయం చేకూర్చాలని ప్రజా ఆశీర్వాద సభలో కోరుతున్న ఎమ్మెల్సీ రాజు


బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులకు పార్టీ కండువాలకు కప్పుతున్న ఎమ్మెల్యే


సుభాష్‌నగర్ డివిజన్‌లోని జగన్నాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్


నిజాంపేట్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్


పార్టీలో చేరిన వారికి బీజేపీ కండువాలు కప్పుతున్న కూన శ్రీశైలంగౌడ్

బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యం

• కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ • వివిధ పార్టీల నేతలకు బీజేపీ కండువా కప్పి ఆహ్వానం

కుత్బుల్లాపూర్: అవినీతిమయ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని... బీజేపీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏర్వ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కూన శ్రీశైలంగౌడ్‌వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయలను కాజేసిందన్నారు. ప్రభుత్వ వైఫల్యంతోనే నేడు మేడిగడ్డ బ్యారేజీ కూలిపోయే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. అవినీతిపై ప్రశ్నించే ప్రతిపక్షాలపై పోలీసులతో దాడులు చేయించడం తప్ప కేసీఆర్‌కు ఏమి చేతకాదన్నారు.


పార్టీలో చేరిన ఓ వృద్ధురాలు శ్రీశైలంగౌడ్‌ను ఆశీర్వదిస్తున్న దృశ్యం

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు..

◆ బంగారు తెలంగాణ తీసుకువస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. లక్షలాది మంది నిరుదోగ్యులను రోడ్డున పడేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలను సామాన్య ప్రజలకు ఇవ్వకుండా గులాబీ కార్యకర్తలకే ఇస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాన్యులకు ప్రగతి ఫలాలను అందజేస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి...

◆ కేంద్రప్రభుత్వం అందజేస్తున్న నిధులను దారి మళ్లించి తమ పథకాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. రేషన్ బియ్యం, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వంటి పథకాలల్లో కేంద్రం వాటా ఉందన్నారు. తెలంగాణాను దోపిడీ చేసిన కేసీఆర్ కుటుంబాన్ని జైలులో ఊచలు లెక్కపెట్టించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ ఒకటే..


◆ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండు ఒకటేనని, రెండు పార్టీలు కుటుంబ పార్టీలేనని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కుత్బుల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నిఖిల్ మునిగంటి, గొల్ల మహేష్, గ్యాన్, సామల చింటూ, రాజేష్, వంశీ, శ్రీనాథ్, సన్నీ, పాండు, బిందు వర్ధన్‌రెడ్డి, కౌశిక్, అఫ్రిది, హర్షిత్, సుధాకర్, సంతోష్ కుమార్, విజయ్, కృష్ణ, రాజేష్ తదితరులు పార్టీలో చేరారు.


నిజాంపేట్ కార్పొరేషన్ నేతలతో సమావేశం

◆ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్ల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శ్రీశైలంగౌడ్ సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో జరిగిన భూకబ్జాలు, అవినీతిపై పోరాడాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి తిరుగుతూ కమలం గుర్తుకు ఓటేసి బీజేపీని గెలిపించేలా కృషి చేయాలని సూచించారు.

చాకలిమెట్ల శంకర ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

◆ నర్సాపూర్‌లోని చాకలిమెట్ల శ్రీశంకర ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం శ్రీశైలంగౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని.. తెలంగాణలో దొరల ప్రభుత్వం అంతం కావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీశైలంగౌడ్‌కు ఆశీర్వచనాలు అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడ్డం రాజేందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్ యాదవ్, ఏర్వ వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గరిగే శేఖర్ ముదిరాజ్, డివిజన్ ఇన్‌చార్జ్ మోతె శ్రీనివాస్‌యాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీశైలంగౌడ్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ అర్చకులు


చాకలిమెట్ల శ్రీశంకర వీరాంజేయస్వామికి పూజలు చేస్తున్న కూన శ్రీశైలంగౌడ్